సుందరం శివం సత్యం

నాకు మా బావంటే ఇష్టం ఎందుకు,
ఎంత ? అంటే నేనేం చెప్పలేను
ఒకర్ని చూస్తే ఒకరికి ఎందుకో తెలియదు
గాని - ఇష్టం అలాగే మా బావంటే నాకు
విపరీతమైన లైకింగ్... ఇదే ఏమరదలు
పిల్లో అంటే ఇంకేముంది. అమాంతం
బావను ప్రేమించేసిందంటారు అదృష్ట
వశాత్తు మగవాణ్ణిగనుక ఎవరూ చెప్ప
కోరు. ఇదోరకమైన మగప్రేమేమో అని
అనుకోవచ్చు మా బావమాటలు శిలల
కన్నా కఠినంగా ఉంటాయి. మొహం
కూడా కఠినంగానే కనిపిస్తుంది
మనసులో బోలెడు మార్దవం ఉంది. అప్పు
డప్పుడు చిన్న పిల్లాడిలా ప్రవర్తి
స్తుంటాడు వస్తుతః ధనవంతుల బిడ్డ
దానికితోడు వ్యాపారంలో రెండుచేతులా
గణిస్తున్నాడు. ఓసారి బెజవాడ బంధువుల
ఇంటికి పెళ్ళికి వెళ్ళాను మాబావకూడ
వచ్చాడు ఆయనకు దగ్గరబంధువులు
వాళ్ళు. పెళ్ళికివచ్చిన పెద్దల్లో ఈయన
వి ఐ పి అందరూ ఆయన్ని వి ఐ పి.
లాగానే చూస్తున్నారు పెళ్ళివారింటికి
పక్కనున్న ఇల్లుగూడా - వాళ్ళెవరో
మంచివాళ్ళు పాపం - ఖాళీచేసి పెళ్ళికి
వచ్చిన బంధువులకిచ్చారు భోజనాలయిం
తరువాత - రాత్రి పడుకోడానికి స్థలం
కోసం వెతుక్కుంటున్నాను పక్క
ఇంట్లో బోలెడంత ఆవరణఉంది దాంట్లో
చాలా వేపచెట్లున్నాయి ఒకమూల నులక
మంచం ఎవరికీ కనపడకుండా నిల్చుని

ఉంది. మరీఒదిగి కొంతమంది బెడ్డిం గులు, జంపకానాలు పరచి ఎక్కడి వాళ్ళక్కడ నడుం వాలుస్తున్నారు నేనా నులకమంచం తీసుకువచ్చి దూరంగా ఓమూల వేపచెట్టుకిందవేసి దానిమీద పడుకున్నాను ఎండాకాలం చిటచిట లాడుతున్నది చొక్కా బనీను కూడా తీసి పడుకున్నాను నులకమంచంలో నులక గరుగ్గా పదునుగాఉంది వీపు నులకకేసి రుద్దుతూ అటూ ఇటూ కదు లుతుంటే చాలా హాయిగా ఉంది. నులక బిగింపు సరిగాలేదు ఉయ్యాల్లో పడు కున్నట్టుగా ఉంది ఓ సిగరెట్టు ముట్టించి నులకమంచం సుఖాన్ని అనుభవిస్తూ ఆకాశంలోకి చూస్తున్నాను వేపచెట్టు మీంచి వచ్చే గాలికూడా వేడిగా ఉంది

ఇంతలో మా బావ సన్ను పసికట్టి ఎక్కడ నుండి వచ్చాడో అమాంతం ప్రత్యక్షం అయి 'ఏంరా నీకోసం వెదుకుతుంటే ఇక్కడపడుకున్నావా ?' అన్నాడు చాలా కఠినంగా ... ఇక్కడ హాయిగా ఉంది బావా అన్నాను అయితే జరుగు, అంటూ నాపక్కనచేరాడు ఆమంచం చిన్నది ఇద్దరికిసరిపోదు మరీ అంత దగ్గరకు రాకు బావా అన్నాను అనేకొద్దీ పక్కకు జరుగుతున్నాడు ఓ రేయ్. . పూర్వ జన్మలో నీవు నాపెళ్ళానివిరా అన్నాడు నాకు నిజానికి సిగ్గేసింది

ఎప్పుడన్నా బీడీ కాల్చేవురా ? అన్నాడు ఛ...అదేమిటి బావా ! నువ్వూ నేనూ బీడీలుకాలుస్తామా ! రైల్వేపోర్టర్లూ రిక్షావాళ్ళూ కాలుస్తారుగాని అని అన్నాను దాంట్లో ఏమన్నా మజావుందేమో చూడాలి అంటూ రెండు బీడీలుతీసి నాకొకటి ఇచ్చాడు నాకాశ్చర్యం వేసింది గోల్డ్ ఫ్లేక్, స్పెన్సర్ సిగార్సూ తప్ప ఎప్పుడూ మరోటి కాల్చని బావ బీడీ ఎందుకు ముట్టిం చాడో తెలియదు బీడీ ముట్టించి - దట్టంగా నామీదికి పొగవదిలాడు గుర్రబ్బాండీ వాసనవచ్చింది. రెండు దమ్ములు లాగి భలేఘాటురా...అన్నాడు కంపెనీకోసం నేనూ ముట్టించాను ఆఘాటుకు తట్టుకో లేక ఉక్కిరి బిక్కిరి అయాను. అవతల పారేశాను ఆయన నవ్వాడు నేనూ నవ్వాను ఇద్దరం నవ్వుకున్నాం ఈవేళ భోజనం చాలా హెవీగా ఉందిరా. గోంగూరపచ్చడి బ్రహ్మాండంగా ఉందిరా అన్నాడు ఆయనకు ప్రతి దాంట్లోనూ ఆనందం కవ్విస్తుంది మాట్లాడుతూ మాట్లాడుతూ నిద్ర కుపక్రమించాడు ఆయనకు కళ్ళు మూసుకుంటే - వెంటనే నిద్రపడ్తుంది గురకలుగూడా పెడ్తు న్నాడు నిద్రలో నామీద చేయివేశాడు మాబావనుగురించి ఆలోచిస్తూ పడు కున్నాను ఇలాంటిబావ నాకు లభించడం నా అదృష్టమే అనుకున్నాను

వ్యాపారనిమిత్తం హైదరాబాదు అప్పు డప్పుడు వస్తుంటాడు బావ వచ్చేటపుడు ఏదో మునిగిపోయినట్టుగా టెలిగ్రాం ఇస్తాడు నా కసలు ఎక్కడనుండయినా



టెలిగ్రాంవస్తే విపరీతమైన భయం ఎక్కడ ఎవరికి ఏం కొంప మునిగిందేమోనని ఆయన నాతో చాలాసార్లు అన్నాడు హైదరాబాదులో అడుగు పెడ్తూనే నీవే ముందు కన్పించాలిరా ... అని ఒకసారి ఏదో అర్జంటు పనిఉండి స్టేషనుకు వెళ్ళలేదు టాక్సీ దిగుతూనే ఏంరా...కళ్ళు నెత్తిమీదికి వచ్చాయా... అవ్వలే పెద్ద ఆఫీసరువిగదూ నీకంటికి మేం కన్పిస్తామా ? అన్నాడు ఆమాటలు కఠినంగానూ ఓ విధమయిన విసురుగా ఉన్నాయి అలాంటప్పుడు నేనేం' సమాధానం చెప్పకుండా నవ్వుతాను. అంతకన్న పెద్దగా ఆయన నవ్వుతాడు భుజంమీద గట్టిగా చరుస్తాడు పెద్దగా. ఆయనవి బలమైనచేతులు పొడవైనవేళ్ళు వీపుమీద అయిదువేళ్ళు అచ్చు పడవలసిందే కొంచెం బాధ కలిగినా ఎందుకో హాయిగా 'ఉంటుంది భోజనానికి లే బావా అంటే కందిపచ్చడి చేశారా లేదా ? అంటాడు బావగారువస్తే అది లేకుండానా... అంటాను ఆయనకప్పుడు ఎంత సంతోషమో చెప్పలేం. ప్రతి చిన్నవిషయానికి ఆనందిస్తాడు. అది నాకెంతో తృప్తినిస్తుంది ఇతరులను కూడా అలాగే ఆనందపరుస్తాడు మాబావ వస్తే నాకు పండగలాగే ఉంటుంది మా బావను తల్చుకున్నపుడల్లా మాఅక్క ఎంత అదృష్టవంతురాలో అనుకుంటూ ఉంటాను మా అక్కపేరు సుందరి

ఆమెను సురీ అని, దరీ అని చిలిపిగా పిలుస్తుంటాడు ఆయన నోటికి ఏదొస్తే ఆపేరుతో పిలుస్తుంటాడు నన్నోసారి ఒరేయ్ చతుర్భుజం... అన్నాడు. ఏవిటి బావా, ఈ పేర్లు. నీకొచ్చిన జామెట్రీఅంతా చూపించేస్తున్నావ్... అన్నాను.

నీపేరు శివరామారావు కాదుటోయ్... అన్నాడు. అవును నాపేరు అదే. నన్ను శివం అంటాడు బావ. ఆపేరుతో పిలిస్తే నాకెంతో బావుంటుంది. మాబావను గురించిన సంఘటనలు చెప్పుకుపోతే ఎంతైనా ఉన్నాయి నాకోచెల్లెలుంది.ఆమె పేరు సత్యవతి యమ్మే ప్యాసయి కాలేజీలో ఉద్యోగం చేస్తున్నది ఆమెను సత్యం అని పిలుస్తాడు బావ చిన్నప్పుడు మహా ఏడ్పించేవాడు ఆమెను ఆమె పియుసి చదువుతున్నప్పుడు ఓసారి బావతో అన్నది - "నీకంత పలుకుబడి ఉన్నదిగదా నాకో చిన్న ఉద్యోగం ఇప్పించగూడదూ" అని మా బావ నవ్వుతూ 'అక్కడా అక్కడా ఉద్యోగం ఎందుకూ... నాదగ్గరే నాకు పి. ఏ గా ఉండు. 'పే' మాత్రం ఏమీవుండదు' అన్నాడు సత్యవతి నవ్వింది నేనూ నవ్వేను అందరం నవ్వేం... అందరి నవ్వూ అయింతరువాత 'పిచ్చిపిల్లా... నీకు ఉద్యోగం ఎందుకమ్మా. నీకో మంచి సంబంధంచూసి వైభవంగా పెళ్ళిచేస్తాం అందరంకలిసి' అని అన్నాడు ఫో... బావా... అంటూ సత్యవతి పరుగెత్తింది ఆడామగా విచక్షణలేకుండా అందర్నీ నవ్విస్తుంటాడు బావ జీవితంలో ఆనందం తప్ప మరోటి ఎరగనివ్యక్తి మా లలిత (నా శ్రీమతి) కూడా అన్నయ్యగారు వచ్చారని అంటూ నోరంతా తెరచుకుని కళ్ళు పెద్దవిచేస్తూ గెంతినంత పని చేస్తుంది - మాబావ ఎప్పుడైనా మాఇంటికి వచ్చినపుడు సత్యవతి ఇప్పుడు గుంటూరులో పని చేస్తున్నది.

నాకు మరో చెల్లెలుంది మాపింతల్లిగా రమ్మాయి పుత్తడిబొమ్మ... పేరు అన్నపూర్ణ. ఆమె పెళ్ళికి వెళ్ళినపుడు నేనూ, బావా, ఎంత అల్లరోచేశాం ఎంతో సరదాగా గడిపేం అన్నపూర్ణకు బోలెడు ప్రజంట్సు తీసుకొచ్చాడు బావ. ఆరోజురాత్రి ఊళ్ళో ఎక్కడో హరికథ చెప్తున్నారని తెలిసి నన్ను లాక్కెళ్ళాడు. హరికథ వింటూ బ్రహ్మానందంగా ఉందన్నాడు ఇంటికివచ్చి హరిదాసు ఎగిరినట్టే తనూ ఎగిరేడు. ఏవిటి బావా మరీ చిన్నపిల్లాడి వయిపోతున్నావ్ అంటే నామీద ఇంతెత్తున ఎగిరేడు నేను కాలికి గజ్జెగట్టి చేతికి చిరుతలు తీసుకుంటే ఎలాఉంటుందో తెలుసా... అంటూ ఒక పద్యం ఎత్తుకున్నాడు బావంటే ఆయనే బావ. అన్నపూర్ణపెళ్ళి అలా జరిగి పోయింది. పెళ్ళి మొన్న మొన్న అయి నట్టుగా ఉంది, మూడేళ్ళయినా. మాబావ వాళ్ళను ఆశీర్వదిస్తూ చిలకా గోరింకల్లాగ- అన్యోన్య దాంపత్య సుఖంతో కలకాలం

పండంటి పిల్లల్నికని హాయిగా వర్ధిల్లండి అని దీవించాడు. నేనూ దీవించాను, అందరూ దీవించారు. పదే పదే పేర్లు చెప్పించారు. పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ భోజనాల దగ్గర కూర్చున్నపుడు– మాబావ నానా హడావుడి చేశాడు. వాళ్ళచేత ఒకరిఎంగిలి ఒకరికి తినిపించాడు. అన్నపూర్ణ మొగుణ్ణి అమాంతం కావలించుకున్నాడు బావ. కావలించుకుని అతణ్ణి ఊపేస్తూ నీవు చాలా లకీఫెలోవోయ్... నీకు బంగారుబొమ్మ దొరికింది అన్నాడు. మా బావ ఆప్యాయతను చూస్తుంటే నాకు కళ్ళు చెమర్చినయి.

ఆ దృశ్యం ఇంకా నా కళ్ళల్లో మెదుల్తూనే ఉంది. పుత్తడిబొమ్మ .. అన్నపూర్ణకు ఇంతలో ఇంత అవాంతరం వస్తుందనుకోలేదు.

పెళ్ళయిన సంవత్సరానికే అన్నపూర్ణ మొగుడు జీప్ యాక్సిడెంటులో ... అన్నపూర్ణ గాజులు పగలగొట్టి– స్టీరింగ్ బలంగా గుండెలకు అదుముకుని– పోతూ పోతూ ఆమె నుదుటి కుంకుమ బలంగా

చెరిపేసి - ఆమెను పేలవంచేసి మరీ వెళ్ళిపోయాడు నిర్దాక్షిణ్యంగా.

అన్నపూర్ణకు ఇపుడు ఇరవై ఏళ్ళు. ఈ విషాదవార్త విన్నపుడు మా బావ ఎంతగానో ఏడ్చాడు అందరికన్నా ఎక్కువగా ఎప్పుడు ఆ విషయం తలపు వచ్చినా దుఃఖం కట్టలుత్రెంచుకుని వచ్చేది. చిన్నపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చేవాడు. సంవత్సరం దాటింది. గాయం క్రమంగా మానుతున్నది అన్నపూర్ణ ఇపుడు అత్తవారింట్లోనే అత్తమామలకు సపర్యలు చేస్తూ ఉన్నది వాళ్ళది గోదావరి జిల్లాలో ఓ పల్లెటూరు లలిత ఎప్పుడూ అంటుంది ఆమెను తీసుకురమ్మనమని ఆ పల్లెటూర్లో బొట్టన్నా పెట్టుకోనివ్వరు. అందరూ కాకులు పొడిచినట్లు పొడుస్తారు. అదీ ఆమె బాధ ఇక్కడకు తీసుకువస్తే ఏదో చిన్న ఉద్యోగంలో చేర్పించవచ్చు నని - లలిత అనుకుంటూ ఉంటుంది. లలితకు ఎన్నో కోరికలున్నాయి అన్న పూర్ణను మనిషిని చెయ్యాలని. ఇంటికి రాగానే ముందు చేసేపని లలిత ఆమెకు బొట్టు పెడుతుందట. లలిత ఎంత అమాయకురాలూ అనుకున్నాను.

* * *

ఎప్పుడూ అన్నపూర్ణే నాకళ్ళల్లో ఉంటుంది అన్నపూర్ణను గురించి ఆలో చిస్తున్నాను. ఇంతలో లలిత టెలిగ్రాం వచ్చిందండీ...అన్నది టెలిగ్రాం మా బావ దగ్గరనుండి. ఎప్పుడూ తను వస్తున్నానని ఇచ్చేవాడు. ఇప్పుడు నన్ను రమ్మన్నాడు పైగా అర్జంటట... నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు

'ఏవండీ నేనూవస్తాను పదండి ... అన్నయ్యగారు టెలిగ్రాం ఎందుకిచ్చారో అని నాకూ ఆదుర్దాగా ఉంది మీరు ఒక్కరూ వెళ్తే నేనిక్కడ ఒక్కతెనీ బిక్కుబిక్కు మంటూ కూచుంటే మరీ ఆందోళనగా ఉంటుంది...' అన్నది లలిత అన్నయ్యగారికి ఏ ఆపదా రాకూడ దని వేయి దేవుళ్ళకు మొక్కుకున్నది. లలిత

అన్నపూర్ణకు అన్యాయం జరిగినప్పటి నుండీ మాఇద్దరికీ మనసు ఎప్పుడూ ఆందోళనకరంగా ఉంటోంది - ఎప్పుడు ఏది వినవలసి వస్తుందో అని. అయినా మాబావకు బోలెడు బలగంఉంది కోఅంటే కోటిమంది వచ్చివాల్తారు. ఆదుకుంటారు ఎంత వద్దనుకున్నా ఎప్పుడూ మనసు కీడే ఊహిస్తుంది అందుకేనేమో కీడెంచి మేలెంచమన్నారు అయినా మాబావను చూసి చాలారోజులయింది. ఆయనో గమ్మత్తుమనిషి. నన్ను ఊరికేచూద్దామని- అలా అంటేగాని రానని టెలిగ్రాం ఇచ్చా దేమో. ఇన్ని ఆలోచనలెందుకు ఒకసారి వెళ్తే సరిపోదూ అనుకున్నాను మాబాస్‌కు ఫోనుచేసి చెప్పి - నేనూ లలితా బయలుదేరాం. రైలులో కూచున్నంత సేపూ లలిత మౌనంగా, కిటికీదగ్గర కూర్చుని - కిటికీలోంచి ఆకాశాన్ని



భూమిని, కూడా పరుగెత్తుకొస్తున్న చెట్లనీ తదేకదీక్షతో చూస్తున్నది. నేను సిగరెట్లు ఊదేస్తున్నాను

మా బావ ఇల్లు చాలా పెద్దది దగ్గరఉండి మరీ మోడరన్‌గా కట్టించుకున్నాడు. ఇంటిముందు రకరకాల క్రోటన్స్... పూలమొక్కలు ఆయనకు బోగిన్‌విలా అంటే చాలా ఇష్టం రంగు రంగుల బోగిన్‌విలా నాలుగువైపులా ఇంటిని అంటిపెట్టుకుని ఉంటాయి ఇంట్లో నౌకర్లకేం కొదవలేదు. రెండు జాతికుక్కలున్నాయి. హైదరాబాద్ వచ్చినపుడల్లా వాటికోసం ఖరీదైన బిస్కెట్లు తీసికెళ్తుంటాడు ముగ్గురు పిల్లలు బావకు పెద్దది ఉమ పన్నెండేళ్ళుంటాయి తరువాత రమ మూడోవాడు రవి అయిదేళ్ళుంటాయి. బడికి వెళ్తున్నాడు. మామూలుగా పెద్దవాళ్ళ ఇళ్ళల్లో ఉండే ఆధునిక పరికరాలన్నీ ఉన్నాయి–రేడియోగ్రామ్ మొదలుకుని రిఫ్రిజిరేటర్ దాకా రిఫ్రిజిరేటర్‌లో దోసావకాయ పెట్టించాడు సుందరక్కతో పోట్లాడి దాంట్లో వచ్చేళ్ళూ, ఊరగాయలూ పెట్టుకుంటారటండీ అని నవ్వింది ఓసారి మా సుందరక్క.

రైలుదిగి భయపడుతూ భయపడుతూ, నేనూ లలితా ఇంట్లో అడుగుపెట్టాం వెంటనే మా బావ కన్పడలేదు ఇల్లంతా బంధువులతో సందడిగా ఉంది

ఒకగదిలో సుందరక్క పడుకుని ఉంది. పక్కనే బావ కూచుని ఉన్నాడు నన్నుచూస్తూనే, ఒరేయ్... మీ అక్క దగ్గరకూచో అన్నాడు నేను అటువైపుగా వెళ్ళి అక్కపక్కన కూచున్నాను సుందరక్క రెండు రోజులనుండి కోమాలో ఉందిట. డాక్టరు అది డయబెటిక్ కోమా అన్నాడు మందులూ ఇంజక్షన్లు ఇస్తున్నారు మరో ఇరవై నాలుగు గంటల్లో తెలివి రావచ్చు అంటున్నారట డాక్టరు. ఎంతకీ తెలివిరాదేం అని డాక్టరు హోరా హోరీగా పోట్లాడుతున్నాడు బెజవాడ పెళ్ళిలో గోంగూర పచ్చడితిని బీడీకాల్చిన బావ నాకెదురుగా కూర్చుని ఉన్నాడు. ఈబావే అన్నపూర్ణ పెళ్ళిలో హరికథ వినివచ్చి ఇల్లంతా గంతులువేశాడు ఇప్పుడు చలనరహితంగా భయంకర నిశ్శబ్దంలో కూచుని ఉన్నాడు. ఇల్లంతా బంధువులతో సందడిగా ఉన్నా భావురుమంటోంది సుందరక్క ఆఇంటికి దీపం ఆమె అటూ ఇటూ కదుల్తుంటేనే ఆ ఇంటికి వెలుతురు. ఆవెలుతురుముందు ఏ ట్యూబ్ లైట్లూ పనికిరావు

సాయంత్రం మళ్ళీ డాక్టరు వచ్చాడు. కోమాలో కొన్ని కాంప్లికేషన్స్ కూడా వచ్చాయి అన్నాడు కిడ్నీస్ ఎఫెక్ట్ అయినయి. బ్లడ్ సర్క్యులేషన్ మామూలుగాలేదు ఇంజక్షన్స్ ఇస్తూనే ఉన్నాడు. సుందరక్క కళ్ళు మూసుకునే మా అందరివైపు చూస్తున్నది సత్యవతి కూడా వచ్చినట్లుంది పిల్లల్ని సముదాయిస్తున్నది. మరోగదిలో కూర్చుని వాళ్ళతో ఏదోకబుర్లు చెప్తున్నది రవిని ఆపడం కష్టం. వచ్చి అమ్మదగ్గర పడుకుంటా నంటున్నాడు.

గదిగుమ్మంలో నిల్చుని – 'అన్నాయ్. ఓసారి రారా.. ' అని నన్నుపిల్చింది. 'బావగారు మరీజావైపోతున్నారు. అలా వసారాలోకి తీసికెళ్ళి ఆయనతో ఏదైనా మాట్లాడుతూ ధైర్యంచెప్పు'–అని అన్నది. నాకాసమయంలో బావతో మాట్లాడాలంటే భయంగానూ దిగులుగానూ ఉన్నది

సత్య కాఫీ తెచ్చి ముందుగదిలో ఉంచింది

బావను నెమ్మదిగా చేయిపుచ్చుకుని లేవదీశాను. యాంత్రికంగా నాతోవచ్చి కాఫీ తీసుకుంటున్నాడు కాఫీ త్రాగుతూ బావే సంభాషణ కుపక్రమించాడు 'ఒరేయ్ ... ఆడవాళ్ళకు డయబిటిస్ వస్తుందిరా... నేనెప్పుడూ అనుకోలేదు. అది లోపల దాక్కుని ఇప్పుడు బయట పడ్డది సుందరి ఎప్పుడు నాతో అననేలేదు దీన్నిగురించి.. ' అంటూ.

'అవును బావా ... ఆజబ్బు లక్షణమే అంత. మొదట్లో ఏమీ తెలియదు ఆరోగ్యంగా మిసమిస లాడుతూనే కన్పిస్తారు. అయినా మూడు కాన్పులమీదట నెమ్మదిగా ఇప్పుడు బయట కొచ్చుంటుంది' అన్నాను

'ఈ కోమా చూస్తుంటే నాకుభయంగా ఉందిరా' అన్నాడు.

'ఈ రాత్రికి తెలివి వస్తుందిలే బావా... డాక్టరు ధైర్యం చెప్పేడుగా' అన్నాను.

ఇద్దరు డాక్టర్లు ఒకరిని ఒకరు సంప్రదించుకుని వైద్యం చేస్తున్నారు. సాయశక్తులా ప్రయత్నం చేస్తున్నారు. ఈ రాత్రి గడిస్తే ఫరవాలేదన్నాడు డాక్టరు.

ఆరాత్రి గడియారంవైపే చూస్తూ కూచున్నాను. బలవంతాన చేతులో పెట్టినా ఆ ముళ్ళు కదల్లంలేదు. మాబావ నాబుజంమీద చేయివేసి నన్నంటి పెట్టుకునే కూర్చున్నాడు.

సుందరక్క ఆ ఇంటికిదీపం. మిణుకు మిణుకుమంటూ ఉంటే, ఆజ్యోతి గాలికి అటూ ఇటూ పాము పడగలా కదులుతున్నది. మేంచూస్తుండగానే ఎవరోగట్టిగా ఊదేశారు దాన్ని. అటూ ఇటూవేగంగా కదుల్తూ ఒక్కసారి ఆరిపోయింది. మాబావ నన్ను కావలించుకుని ఘొల్లుమన్నాడు. గుండెలు బద్దలయ్యేట్టు ఏడ్చాడు. ఫెడీ ఫెడీ గుండెలు బాదుకున్నాడు. ఆ ఇంట్లో చీకటి చిందులు తొక్కింది. ఇంతకన్నా జరిగినఘోరాన్ని వర్ణించలేను. రాస్తుంటేనే నాకు ఏడుపువస్తున్నది. ఏప్రేమ సంఘటనో అయితే అందరికీ సంతోషాన్ని గలిగించేట్టుగా వర్ణిద్దును.

మర్నాడు జరగవలసిన కర్మకాండలన్నీయథావిధిగా జరిగినై. ఏదీ ఆగదు.

రోజూ సుందరక్కకు పూలు ఇచ్చే మనిషి ఎంతగానో ఏడ్చింది సిరిగలతల్లీ సుందరమ్మా... అపుడే నీకు నూరేళ్ళు నిండేయా... అంటూ భోరు _ భోరున ఏడ్చింది. మహాదొడ్డఇల్లాలు... అన్నది. స్మశానానికి వచ్చి బుట్టెడుపూలు శవం మీద కుమ్మరించింది. సుందరక్కకు మల్లెపూలంటే ఇష్టం. ఆబజారువాళ్ళంతా సుందరక్కను తల్చుకుని కంటతడి పెడ్తూనేఉన్నారు.

ఎన్నాళ్ళుండగలను బావదగ్గర. బావను ఎవరు ఓదార్చగలరు. అక్కడ ఉన్నన్నాళ్ళూఉండి నేనూ లలితా బయలుదేరేం. మా సుందరక్క పోయిందన్న దుఃఖంకన్నా, మా బావకు ఇలాంటి ఆపత్తు వచ్చిందని రైల్లోకూడా నాకేడుపు వచ్చింది. రైలుకూడా మాతోపాటు రోదపెడ్తూనే మమ్మల్ని తీసుకువచ్చి హైదరాబాద్‌లో పారేసింది.

* * *

రోజులు గడుస్తున్నాయి. కాలం పరుగెత్తుతూనే ఉంటుంది. అన్నపూర్ణ మొగుడుపోయి రెండేళ్లు దాటింది. ఇప్పుడు సుందరక్క. తగిలిన వేలుకే తగులుతుందిదెబ్బ. రెండోసారి తగిలిన దెబ్బ మరీ బాధగా ఉంటుంది. మొదటిది పూర్తిగా నయం కాదుగనుక _ మాబావకు బోలెడు ఆస్తి ఉందినుక _ బెల్లంచుట్టూ చీమలు మూగాయి. ఆయన బంధువులెవరో ఒకళ్ళిద్దరు,ఇప్పుడు ఆయనదగ్గర ఉంటున్నారు. ఒకాయన వేలువిడిచిన

మేనమామ రెండో ఆయన ఆ మేనమామకు దగ్గర చుట్టం వ్యాపారంలో సహాయంచేద్దామని వచ్చారు బావకిప్పుడు నలభై ఏళ్ళు ఈ వయసులో – అలాంటి పరిస్థితుల్లో ఏ వ్యసనానికైనా బానిస కావడానికి అవకాశాలున్నాయి... కొన్ని దుఃఖం మరచిపోవడానికి, కొన్ని వయసు మరచిపోవడానికి ఎవరైనా వ్యసనాలను అలవాటు చేసుకుంటారు మా బావను గురించి నాకూ లలితకూ ఇదే భయం పట్టుకుంది ఒకభయం తరువాత మరో భయం

లలిత ఓరోజు బావనుగురించిన ప్రస్తావన తెచ్చింది – ఏమండీ చాలా రోజుల్నుండి మిమ్మల్నోమాట అడగాలనుకుంటున్నానని...

'అన్నపూర్ణకు పెళ్ళిచేస్తే బావుంటుందండీ .. అన్నయ్యగారు చేసుకోవచ్చు ఈపని మీరు పూనుకుంటే అవుతుంది' అన్నది 'ఆపని – మహానుభావుడు వీరేశలింగానికే చెల్లింది నేనేం చేయగలను' – అన్నాను

ఇలాంటి వివాహాల్ని గురించి చాలాసేపు మాట్లాడుకున్నాం నేనూ లలితా

'దీంట్లో తప్పేముంది? భర్తపోయిన అన్నపూర్ణ, భార్యపోయిన అన్నయ్యాగారూ . ఇద్దరూ ఒకే పరిస్థితిలో ఉన్నారుగదా ఆయన పెళ్ళిచేసుకోకుండా ఉండేవయసు కాదు మగవాడన్న తరువాత తప్పక చేసుకోని తీరుతాడు. ఏ చిన్నపిల్లగొంతో కోయడంకన్నా అన్నపూర్ణలాంటి దాన్ని చేసుకుంటే ?' అన్నది లలిత

'బాగానేవుంది – కాని ... మా బావ ఒప్పుకోవద్దూ అయినా అందరూ ముక్కుమీద వేలువేసుకుంటారు ఇదిజరిగితే...' అన్నాను

'అన్నపూర్ణ కుంకుమకైనా నోచుకోలేదు ఎలాఉందోపాపం...ఓసారి చూసి రావాలి, అన్నది లలిత

అన్నపూర్ణ మామగారికి దాదాపు యాభై ఏళ్ళుంటాయి ఆయనతల్లి రాంబాయమ్మగారు వృద్ధాప్యంలో ఆయనదగ్గరే ఉంటున్నారు ఆయనకంత వయసువున్నా చిన్నవాడుగా కన్పిస్తాడు అన్నపూర్ణ అత్తగారు గూడా చలాకీ అయిన మనిషే ఎప్పుడూ నవ్వుతూ పేలుతూ ఉంటుంది వాళ్ళ – ముగురిమధ్య అన్నపూర్ణ ఎలాఉందో ఏవిటో ? ఒకసారెచూసి రావాలి

నేనోసారి కాకినాడ క్యాంపుకు వెళ్ళాల్సివచ్చింది అన్నపూర్ణ అత్తవారి ఊరు అక్కడకు దగ్గరే. ఓ ఆదివారం వెళ్ళి రావచ్చు

లలితకూడా నాతో బయలుదేరింది.

రైలులో పోతున్నామన్న మాటేగాని అన్నపూర్ణే కళ్ళల్లో మెదుల్తున్నది తెల్లచీరె నుదుటిమీద కుంకుమలేని చిన్న ఖాళీసున్నా, తైలసంస్కారంలేని జుట్టూ...పాలిపోయిన ముఖం...గాజులు



లేనిబోసిచేతులు ముసలివాళ్ళలా నిండుగా కప్పుకున్న పమిట పొద్దున్నే ఎవరన్నా నిద్రనుండి లేస్తే ఎవరికంటా పడకుండా పక్కకు పక్కకు తప్పుకు తిరుగుతున్న అన్నపూర్ణ

ఈకళ్ళతో అన్నపూర్ణను చూడలేనండీ అన్నది లలిత

ఆదివారంనాడు ఆ ఊరు చేరుకుని భయం భయంగా వాళ్ళఇంట్లో అడుగు పెట్టాం నేనూ లలిత

•మాఇద్దరి కళ్ళూ అన్నపూర్ణ కోసం వెతుక్కుంటున్నాయి ఆమెకన్పించలేదు పరంధామయ్యగారు నోటినిండా పలకరించాడు ఆయన భార్యకూడా చిరునవ్వుతో పలకరించింది నేనింకా అటూ ఇటూ చూస్తూనే ఉన్నాను అన్నపూర్ణ కోసం

'అమ్మాయి ఇంతకుముందే మాఅమ్మగారితో వెళ్ళింది వేణుగోపాలస్వామి ఆలయంలో పురాణం చెప్తున్నారు వచ్చేస్తుందిలెండి ' అన్నారు పరంధామయ్యగారు

ఇప్పటినుండీ పురాణాలకూ, హరికథలకూ వెళ్ళడం తర్ఫీదు చేస్తున్నారన్న మాట ! అని అనుకున్నాను

ముసి ముసినవ్వులునవ్వుకుంటూ పరంధామయ్యగారి భార్య మాకు కాఫీతెచ్చి ఇచ్చింది నేను కాఫీతాగుతూ అటూ ఇటూ చూస్తున్నాను అటువైపుగదిలో పాతకాలపు ఎత్తైన పందిరిమంచం, దానిమీద రంగు రంగుల దుప్పటి ఆగది అధునాతనంగా లేకపోయినా ఓ చక్కటి బెడ్ రూమ్ అని తెలియచేస్తున్నది గోడలకేవో పటాలున్నాయి ఆపటాల్లో

ఊదొత్తులుంచిన గుర్తులు తెలుస్తున్నాయి-నల్లగా విలువుగీతలు మరెక్కడా ఆ ఇంట్లో కనీసం నులకమంచమైనా కన్పించలేదు చిరిగిపోయిన చాపలు రెండు - మూలగా గోడకు ఆనించి ఉన్నాయి అందులో ఒకటి అన్నపూర్ణది అయిఉండాలి నా మనసు చివుక్కు-మన్నది

పరంధామయ్యగారి భార్య మా మీద సానుభూతి చూపిస్తూ ఏదో మాట్లాడుతున్నది మా సుందరక్కను గురించి మాబావకు బోలెడంత కష్టం వచ్చిందన్నది అమాటా ఈమాటా మాట్లాడి ఏదో సంబంధం సంగతి చెప్పింది అదీ మాబావకు ఎవరో వాళ్ళ బంధువుల అమ్మాయిట 'చిన్నవాడేగా మీ బావ పాపం ఇంతాజేస్తే నలభైఏళ్లు ఈ అమ్మాయి అందచందాలకి లోటు లేదు' అంటూ చెప్పుకుపోయింది ఆవిడ

మధ్యలో పరంధామయ్యగారందుకుని-'అదేవిటే . ఆ మెల్లకన్ను అమ్మాయి సంబంధమా నీవుచెప్పేదీ' అంటున్నారు

'అయితే ఏమండీ సలక్షణంగా ఉంటుంది పెళ్ళికొడుకు మాత్రం రెండో పెళ్ళివాడు కాదూ ? కళ్లు కొంచెం మెల్ల అయితే ఏం.. కళ్లు కొరుక్కు తింటామా ఏవిటి ?' అన్నది ఆవిడ

నాకూ లలితకూ నవ్వాలో ఏడవాలో తెలియలేదు ఇద్దరి మాటలకూ నేను సన్నగానవ్వి ఊరుకున్నాను

ఎవరూ అన్నపూర్ణ సంగతి అనుకోరు ప్రాణం ఉన్న మనిషిగా ఎవరూ గుర్తించడంలేదు ఓ కుర్చీనిగురించి, ఓగోడను గురించి . ఇంకా ఇలాంటి ప్రాణంలేని వస్తువులు ఎవరిదృష్టిలోకిరావు ఎవరూ అనుకోరు అన్నపూర్ణ సంగతీ అంతేనేమో ఆమె ఊపిరిపీలుస్తున్న ప్రాణంలేని బొమ్మ ఓ వెలిసిపోయిన గోడ చిరిగిపోయిన చాప ఎండిపోయినచెట్టు కుంకుమ చెరిగిపోయి, మంగళసూత్రం తెగిపోయేసరికి అన్నపూర్ణ అందరిదృష్టిలో చైతన్యం లేని రాయి

నేను ఆలోచిస్తూనే ఉన్నాను లలిత నావైపే జాలిగా చూస్తున్నది వీళ్ళమీద కసితీర్చుకుని ఎప్పుడో అన్నపూర్ణకు తన చేతుల్తో కుంకుమ పెట్టాలని ఆమె కోరిక ఆమె కళ్ళల్లో ఆ కోరిక కన్పిస్తున్నది ఇంతలో రాంబాయమ్మగారూ - అన్నపూర్ణ వచ్చారు అన్నపూర్ణ తలవంచుకుని శూన్యాన్ని పులుముకుంటూ నెమ్మదిగా నడుస్తున్నది వెనకాలే రాంబాయమ్మగారు అన్నపూర్ణ మేం వచ్చినట్లు వెంటనే గమనించలేదు అన్నపూర్ణ చిక్కి సగమైంది పెళ్ళయిన కొత్తల్లో మిసమిస లాడుతూ బంగారు బొమ్మలా ఉండేది భగవంతుడు ప్రత్యేకశ్రద్ధ తీసుకుని బంగారుమూసలో పోశాడేమో అనిపించేది కనుముక్కుతీరులో శిల్పం ఉట్టిపడుతుండేది - ఆ అన్నపూర్ణేనా



ఈమె...కాదు. ఈమె కళ్లు బాగా లోతుకుపోయి... ఎముకలేగాని కళ్ళు కన్పించడంలేదు...

నేనే పలకరించాను: 'ఏంమ్మా ... అన్నపూర్ణా కులాసాగా ఉన్నావా' అని. ఆమె ముఖంలో కాంతి చిమ్మినట్లే చిమ్మి ఆగిపోయింది. నవ్వువచ్చినట్టే వచ్చి ఆగిపోయింది.

అన్నయ్యా... అంది నెమ్మదిగా ... ఎంత సేపయింది వచ్చి అన్నది. ఆరెండు మాటలకే దుఃఖం కట్టలు తెంచుకుని వస్తున్నది ఆమెకు. మరోక్షణంలో బావురుమనేట్లుంది. లలిత అన్నపూర్ణ పరిస్థితి గ్రహించి చప్పునవచ్చి తనచేతుల్లోకి తీసుకుంది. నెమ్మదిగా లోపలకు తీసుకువెళ్ళింది. నేనూ లలితా అన్నపూర్ణతో ఎంతో మాట్లాడుదామనుకున్నాం. మాకు మాట రాలేదు. పరంధామయ్యగారు నన్ను పక్కకు పిలిచారు.

'అమ్మాయికి ఈమధ్య వంట్లో బాగుండలేదు. ఉన్నట్టుండి పెద్దగా అరిచినట్టుగా భయపడుతుంది. ఎక్కడ కారు, జీపు చప్పుడు విన్నా పెద్దకేక పెడ్తుంది. ఒక్కొక్కప్పుడు వళ్ళుతెలీకుండా పడిపోతుంది. మావూళ్ళో ఆచారిగారికి చూపిస్తే హిస్టీరియా అన్నాడు. పూలచెట్లను చూసినా బెదిరిపోతుంది.' అన్నారు. నేనెక్కడో

ఆలోచిస్తున్నాను. నెమ్మదిగా తల ఊపుతున్నాను. కాసేపు అన్నపూర్ణ సంగతి చెప్పి - తనభార్య ఆరోగ్యాన్ని గురించిన వివరాలుచెప్పేరు. ఆమెకు కీళ్ళనొప్పులు. కూచుంటే లేవలేదు. లేస్తే కూచోలేదు. కొంచెంపనిచేస్తే ఆయాసం. పరంధామయ్యగారు చాలా తెలివైనమనిషి. నే నెక్కడ అన్నపూర్ణను హైదరాబాదు పంపించమని అడుగుతానేమోనని...వీలు పడదని చెప్పడానికి అనుకూలమైన వాతావరణం సృష్టించుకుంటున్నారు. మాట్లాడుతున్న వారల్లా మధ్యలో ఆపి - 'మా అమ్మగారిని చూశారుగా ... కళ్ళు సరిగా కన్పించవు. ఎప్పుడూ ఎవరో ఒకరు ఆమెను అంటిపెట్టుకునే ఉండాలి' అన్నారు.

ఇంక నేనేం మాట్లాడేది...

కాసేపు కూచుని అలా బయటకు వెళ్ళొస్తానని ఊళ్ళోకి వెళ్ళాను. ఓ అరగంట తిరిగి ఇంటికివచ్చాను. చీకటి పడుతున్నది. ఇంటికి వచ్చేటప్పటికి ఇంట్లో అన్నపూర్ణ వంటచేస్తున్నది. పరంధామయ్యగారు నశ్యం తయారు చేసుకుంటున్నారు. కాల్చిన పొగాకును ఏదో ఆయుధంతో నుద్దుతూ దాన్ని పౌడరు చేస్తున్నారు. ఆయన భార్య కాళ్ళకు ఏదో తైలం పట్టిస్తున్నది. రాంబాయమ్మగారు కునికిపాట్లు పడుతున్నది. లలిత వంట ఇంట్లో అన్నపూర్ణదగ్గరే కూర్చున్నది.

ఆఇంట్లో ఎవరూ ఎవరితోనూ మాట్లాడుతున్నట్లు కన్పించలేదు. లలిత తాను కూడా సహాయం చేస్తానంటున్నది వంటలో. నీవువద్దులే వదినా...అంటున్నది అన్నపూర్ణ. ఈరెండు మాటలే విన్పించినయి నాకు. రాత్రి భోజనాలయినాయి. అన్నపూర్ణ మాఅందరికీ వరండాలో పక్కలువేసింది. గదిలో పందిరిమంచం మీద దుప్పటి విదిలించి వేసింది. వరండాలో ఓమూలగా రెండు చాపలు పరిచింది. రాంబాయమ్మగారు నడుంవాల్చారు.

పరంధామయ్యగారు మాతో కాసేపు లోకాభిరామాయణం మాట్లాడుతూ - ఊళ్ళో రాజకీయాల్ని గురించి వివరిస్తూ ఆవలిస్తున్నారు. కాలుస్తున్నచుట్ట సగం అయిపోయింది. చిటికెలువేస్తూ లేచి రెండు అడుగులు వేశారు. ఆయన్ని పందిరి మంచం పిలుస్తోంది...

పరంధామయ్యగారూ ఇక పడుకుందామా అన్నాను ఆయన ఇబ్బందిని గుర్తించి.

'వేళకు నిద్రపోకపోతే ... తెల్లారేటప్పటికి కొంచెం చికాకుచేస్తుంది' అని తనసంగతి చెప్పుకున్నారు.

రాంబాయమ్మగారి పక్కనే అన్నపూర్ణ ఒదిగి పడుకున్నది.

* * *

తెల్లవారి నేనూ లలితా తిరుగు



ప్రయాణం అయినాం. అన్నపూర్ణ 'మా ఇద్దరివైపు జాలిగాచూసింది. కళ్ళతోనే మాట్లాడింది. బయలుదేరి వెళ్ళేటప్పుడు నాకళ్ళు చెమర్చినయి. రైల్లో అన్నపూర్ణ సంగతే మాట్లాడుకున్నాం. అన్నపూర్ణకు పెళ్ళిచేయాలని మాఇద్దరి సంకల్పం. మా ఆలోచనలు తెగడంలేదు. 'ముందు మీ బావగారి దగ్గరికివెళ్ళి మీరు ఒప్పించండి. ఆతరువాత అన్నపూర్ణ విషయం నేను చూస్తాను' అన్నది లలిత. లలితకు ఇంత ధైర్యం ఎక్కడినుండి వచ్చిందో తెలియదు. ఏదో ప్లానువేసింది. అనుకున్నంత సులభంగాదు లలితా అన్నాను.

రోజులు గడుస్తున్నాయి ... తగిలిన వేలికే మళ్లీ దెబ్బ... ఇది మూడోది ... పెద్దషాక్... తేరుకునే టప్పటికి నాకు చెమటలు పోసినయి...

అది - సత్యవతి దగ్గరనుండి వచ్చిన ఉత్తరం. సత్యవతి యమ్మే ప్యాసయింది. ఆమె వ్రాసిన ఉత్తరం - అది ఉత్తరమో కత్తిపోటో తెలియలేదు. ఇది త్యాగమో, సాహసమో, మొండితనమో నాకర్థం కాలేదు. ఉత్తరం చదివేను.

"ఈఉత్తరం మీకుఆశ్చర్యాన్ని కలుగజేయవచ్చు. ఎందుకంటే ఇలా జరుగుతుందని మీరు ఊహించి ఉండరు. బావను పెళ్ళిచేసుకోవటానికి నిశ్చయించుకున్నాను. బావకూడ అంగీకరించారు.

నాకూ బావకూ వయసులో పదిహేనేళ్ళ తేడా ఉంది. నేనూ చదువుకున్నదాన్ని. అన్ని విషయాలు ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. ఆయన ఆస్తికోసం ఇలా చేశానని ఎవరైనా అనుకోవచ్చు. ఒకరు అనుకోవడంతో నాకు నిమిత్తంలేదు. రమ, ఉమ, రవి...వీళ్ళు ముగ్గురే నా కళ్ళల్లో మెదిలేరు. బావను సుందరక్క సుఖపెట్టినట్లుగా నేను సుఖపెట్టలేకపోవచ్చు. సుందరక్క దేవత. అయినా బావ దుఃఖాన్ని మరిచిపోయేందుకే ప్రయత్నిస్తాను. ఒక మనిషిలేని లోటు మరొకరు తీరుస్తారంటే – అది జరిగేదికాదు. ఎప్పుడోప్పుడు పెళ్ళి చేసుకోవాలి గదా, ఎవరో తెలీనివాణ్ణి పెళ్ళిచేసుకునే కంటే బావనే చేసుకుంటే నాకో విధమైన తృప్తి నిస్తుందని నా ఆశ. నీకు బావంటే ఎంతో ఇష్టం. నాకూ అంతే. వచ్చే నెలలో ముహూర్త నిశ్చయం తరువాత మళ్ళీ వ్రాస్తాను. నీవూ, వదినా పెళ్ళికివచ్చి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తూ...

ఉంటాను.

నీ చెల్లి సత్యం."

ఉత్తరం చదివి... ఎంతపని చేశావ్ సత్యా అనుకున్నాను. అన్నపూర్ణ జాలిగా మావైపు చూస్తూ కళ్ళల్లో మెదుల్తూనే ఉంది! ఇలా జరుగుతుందని నేను ఊహించలేదన్నది లలిత.